జూదం మత్తు.. జీవితాలు చిత్తు



ఆన్‌లైన్ వేదికగా కాయ్ రాజా కాయ్ అంటున్న జూదగాళ్లు అప్పుల ఊబిలో చిక్కుకుని ప్రాణాలు తీసుకుంటున్నారు. లోన్ యాప్‌లో అప్పులు తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్ కాస్తూ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కష్టపడకుండా ధనవంతులు అయిపోవాలనే మత్తులో జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు.



- జూదానికి బానిసవుతున్న యువత
- లోన్ యాప్‌లలో అప్పులు
- బెట్టింగ్‌లలో నష్టపోయి బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం

గాలివీడు : జూదం ఆట మహా భారత సంగ్రామానికి కారణమైన విషయం తెలిసిందే. ధర్మరాజును వ్యూహాత్మకంగా దెబ్బతీసి అడవులపాలు చేసిన ఉదంతాన్ని మహా భారత గాథలో మనం చదువుకున్నాం. అయితే ఇప్పుడు మన వాళ్లు ఆడే నయా జూదం ఆటలో ఓడిన వారు అడవులపాలు కాదు. ఏకంగా తమ జీవితాలనే ఛిద్రం చేసుకుంటున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇది ఎదురుపడి ఆడే ఆట కానేకాదు. ప్రత్యక్షంగా సొమ్ములు పెట్టే పనీ లేదు. కానీ బ్యాంకు ఖాతా మాత్రం ఖాళీ అవుతోంది. ఈ ఆట దెబ్బకు సర్వస్వం కోల్పోయిన ధర్మరాజులూ లేకపోలేదు. 'కాయ్ రాజా కాయ్' అంటూ ఒకప్పుడు తిరునాళ్లల్లో కనిపించిన పందేలు ఇప్పుడు ఆన్‌లైన్ బెట్టింగ్ వేదికగా జడలు విప్పాయి. మొబైల్ యాప్‌లలో జూదం ఆడి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకునే వారు క్షణాల్లో పెద్ద మొత్తంలో నష్టపోయి దివాళా తీస్తున్నారు. అంతటితో ఆగకుండా ఆటో, నేనో తేల్చుకోవాలని పంతంపడుతున్న కొందరు అప్పులు చేసి మరీ ఆటలో గుమ్మరిస్తున్నారు. చివరికి మళ్లీ డబ్బులు పోగొట్టుకుని చేసిన అప్పులు తీర్చలేక ఉన్న ఆస్తులు అమ్మేందుకు సైతం తెగిస్తున్నారు. ఆస్తులు లేని వారు మరో మార్గం దొరక్క ఇక చావే శరణ్యమని భావించి బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఇంకొందరు మానసిక ఆందోళనలో పడి కుటుంబాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ మాయ

పట్టణంలోని గేటు ప్రాంతంలో నివాసముంటున్న ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం చేసిన అప్పులు తీర్చేదారిలేక తల్లిదండ్రులకు చెప్పలేక విచారంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. పట్టణంతో పాటు పెద్దూరు, బస్టాండ్ పరిసరాల్లో పలువురు యువత, ఉద్యోగులు ఆన్లైన్ బెట్టింగ్ (గ్యాంబ్లింగ్)లకు అలవాటు పడి ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి సులువుగా డబ్బు సంపాదించాలనుకుంటున్న కొందరు యువకులు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జూదం ఏదైనా ఆ ఊబి లోంచి బయటపడటమే ఉత్తమమని పోలీసులు, మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

పల్లెలనూ తాకిన ఆన్‌లైన్ మహమ్మారి

ప్రస్తుతం పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా 18 నుంచి 40ఏళ్ల లోపు వారిని విపరీతంగా ఆకర్షిస్తున్న జాడ్యం ఇది. చెమటోడ్చి సంపాదించడానికి మొగ్గు చూపని యువత ఇలాంటి వ్యాపకాలతో కోటీశ్వరులు కావాలని కలలు కంటున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే కోరికతో స్నేహితుల ద్వారా ఆన్లైన్ ప్రకటనల ప్రలోభాలతో ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. జూదం నిర్వాహకులు మొన్నటి ప్రపంచ కప్ క్రికెట్ పోటీలు, ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలనూ పందేలకు వేదికగా మలుచుకోవడం గమనార్హం. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన ఉన్న వారికి ఆన్లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగు సైబర్ నేరగాళ్లు ఎర వేస్తున్నారు. తొలుత కొంత లాభం ఆశ చూపి ఆ తర్వాత కదలకుండా ఉచ్చు బిగించి అందినకాడికి దోచేస్తున్నారు. ధనిక, పేద, మధ్య తరగతి అనే తేడా లేకుండా ఎవరో ఒకరు మోసపోతూనే ఉన్నారు.

రుణాల ఊబిలో చిక్కుకుని..

బాధితుల్లో అత్యధికులు స్మార్ట్ ఫోన్‌లపై గంటల కొద్దీ సమయం గడుపుతున్న వారే ఉండటం గమనార్హం. తొలుత కొంత నష్టపోతున్న ఆటగాళ్లు మళ్లీ తిరిగి పొందలేకపోతామా? అన్న ధీమాతో అప్పులు చేసి మరీ ఆటలో గుమ్మరిస్తున్నారు. సులువుగా అప్పు దొరుకుతుండటంతో ఆన్‌లైన్ రుణాల యాప్‌లను ఆశ్రయిస్తుండటం మరో ఊబిలోకి దిగుతున్నట్లు అవుతోంది. ఇలా తప్పుల మీద తప్పులు చేస్తూ చివరికి తమను తానే కాపాడుకోలేనంత ఉచ్చులోకి వెళ్లిపోతున్నారు. అప్పులు ఇచ్చిన వ్యక్తులు వేధిస్తున్న క్రమంలో డిప్రెషన్‌కు లోనవుతున్నారు.అప్పుల బాధ భరించలేక ఆస్తులు అమ్ముకున్న వారు కొందరుంటే ఆత్మహత్యలకు పాల్పడి జీవితాలను,కుటుంబాలను ఛిద్రం చేసుకుంటున్న వారు లేకపోలేదు. అయితే గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో సాగిపోతున్న ఈ నయా జూదానికి పోలీసులు సైతం ముకుతాడు వేయలేకపోతున్నారు. ఆస్తులు కోల్పోయి ఆత్మహత్యలు జరిగినప్పుడు మాత్రమే ఇవి వెలుగు చూడటం విచారకరం.

బెట్టింగ్ మోజులో జీవితాలు నాశనం



యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆన్‌లైన్ బెట్టింగ్ మోజులో జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఎవరికైనా ఇలాంటి ఇబ్బందులు తలెత్తితే యువకులను తల్లిదండ్రులు మా వద్దకు తీసుకువస్తే కౌన్సెలింగ్ ఇప్పిస్తాం. మొబైల్ ఫోన్ల వినియోగంలో పిల్లలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ చట్ట వ్యతిరేకమైన చర్యగా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు.

\- కృష్ణమోహన్, డీఎస్పీ, రాయచోటి

యువత సత్ప్రవర్తన కలిగి ఉండాలి



నేటి యువత దేశానికి ఆదర్శంగా నిలవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ నిర్దేశించుకున్న లక్ష్యసాధన దిశగా పయనించాలి. చదువుకోవాల్సిన సమయంలో పక్కదారి పట్టకుండా గురువులు, తల్లిదండ్రుల సూచనలు పాటిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలి.

\- ఎం.వెంకటేష్, గాలివీడు

చెడు అలవాట్లకు బానిసకారాదు



తల్లిదండ్రులు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాలి. ఎప్పటికప్పుడు పిల్లల ప్రవర్తన గమనిస్తూ ఉండాలి. తరుచూ పిల్లలకు మంచి, చెడులను వివరిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి. వీలైనంత వరకు చిన్న పిల్లలను సెల్ ఫోన్‌లకు దూరంగా ఉంచి ఇతర ఆటలు, క్రీడలపై దృష్టి మరలించేలా చూడాలి.

\- వెంకటాద్రి, గోరాన్ చెరువు, గాలివీడు

క్లుప్తంగా

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న సంబేపల్లె విద్యార్థినులు

సంబేపల్లె : ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు ప్రథమస్థానం సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం వైఎస్ఆర్ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన సంబేపల్లె పాఠశాలకు చెందిన పదవ తరగతి రుక్సానా, 9 తరగతి మౌనిక, తరణ్ కుమార్ గౌడ్‌లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ బాబు

సిద్దవటం : మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన శ్రీశైల దేవస్థానానికి దక్షిణ ముఖ ద్వారంగా ఉన్న బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో 5 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ఆదివారం ఒంటిమిట్ట సీఐ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సాంప్రదాయాలతో ఘనస్వాగతం పలికి పూజలు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ దేవాలయాల్లో నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ ఆలయానికి కడపకు చెందిన గిరిధర్, సిద్దవటానికి చెందిన అతికారి సుబ్బరాయుడుల సహకారంతో రూ.40 వేలు విలువ చేసే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్, ఏఎస్ఐ సుబ్బారామచంద్రుడు, పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నివాళి




మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్ : మండలంలోని ఊటుకూరుకు చెందిన పెద్దరామరాజు కుమారుడు భానుప్రకాష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకేపాటి మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు.

మాన్యం భూమిలో ఆక్రమణలు

బి.కొత్తకోట : స్థానిక పీటీఎంరోడ్డులోని ఆంజనేయస్వామి మాన్యం భూమిలో ఆక్రమణలపై దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ ఆదేశాలపై ఆదివారం అధికారులు స్పందించారు. ఈఓ మునిరాజ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఈవో మునిరాజతో కలిసి మాన్యం భూమిలో పరిశీలన చేశారు. భూమిని ఆక్రమించి బంకులు, దుకాణాలు నిర్వహిస్తున్న వారి వద్దకు వెళ్లి ఎవరి అనుమతితో దుకాణాలు పెట్టుకున్నారని ప్రశ్నించారు. తక్షణమే తొలగించాలని ఆదేశించారు. దీనిపై ఆక్రమణదారులతో చర్చించిన అనంతరం మూడు రోజుల గడువు ఇచ్చారు. ఆ తర్వాత యంత్రాలతో ఆక్రమణలను తొలగిస్తామని ఈఓ తెలిపారు. లేనిపక్షంలో ఆక్రమణదారులపై కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

వైభవంగా రాజగోపుర ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో రాజగోపుర ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు క్రిష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, క్రిష్ణంరాజు, ధనుష్‌లు సంప్రదాయబద్ధంగా మంత్రోచ్చారణలతో ఉదయం చతుష్టార్చన, మధ్యాహ్నం నేఘ్రత్రోవలమలనం, ఛాయాదివసం, సాయంత్రం చతుష్టార్చన పంచఛాయదివసాలను నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోపినాథ్, ఆలయ సూపరిండెంట్ మునిబాలకుమార్, ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్, ఆలయ సిబ్బంది నగేష్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

రేపు వేంకటేశ్వర స్వామి కల్యాణం

రాజంపేట టౌన్ : పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన తిరుమలగిరి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోడూరు చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణం అనంతరం అన్నప్రసాదం, సాయంత్రం నాలుగు గంటల నుంచి కల్యాణ ఉత్సవ మూర్తుల గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోలాటంతోపాటు వివిధ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

నేటి నుంచి షాహిద్ బాబా ఉరుసు ఉత్సవాలు

చిన్నమండెం : మండల కేంద్రంలో వెలసియున్న హజరత్ షాఅలీ గంజే షాహిద్ బాబా రహమతుల్లా అలైహి ఉరుసు ఉత్సవాలను నేటి నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 3వ తేదీన దర్గాలో గంధం మహోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. 4వ తేదీన ఉరుసు ఉత్సవం తోపాటు ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ ఉరుసు ఉత్సవాలకు హిందూ, మహమ్మదీయ సోదరులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

జిల్లా మహిళా జేఏసీ ఏర్పాటు



సమావేశానికి హాజరైన సభ్యులు

రాయచోటి టౌన్ : అమరావతి అన్నమయ్య జిల్లా మహిళా విభాగం రాయచోటి డివిజన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి పట్టణంలో అమరావతి విభాగానికి చెందిన మహిళా సభ్యులతో సమావేశమై నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అలాగే భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో సభ్యులు చర్చించారు.


ఉద్యమాలతోనే కార్మిక హక్కుల పరిరక్షణ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ

రాయచోటి అర్బన్ : ఉద్యమాలతోనే కార్మిక హక్కులు, చట్టాల పరిరక్షణ సాధ్యమవుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘ రాయచోటి నియోజకవర్గ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ పాలనలో కార్మిక హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారంటూ చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ యత్నాలను మానుకోవాలంటూ కోరారు. ప్రైవేటీకరణతో పలువురు ఉద్యోగాలను కోల్పోవడంతోపాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానం మరింతగా అమలయ్యే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాలకులు రద్దుచేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేశారు. పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ హమాలీ కార్మికులకు పెంచిన కూలీ రేట్ల జీఓను వెంటనే అమలు చేయాలని, అరియర్స్‌ను చెల్లించాలంటూ పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులకు సమ్మెకాలంలో పాలకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలియజేశారు. స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలును చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నేత నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు బత్తల రమణ, హుస్సేన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు కేశవరావు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

వావిలికొలనుకు ఘన నివాళి



పూజలందుకున్న వావిలికొలను సుబ్బారావు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం జీర్ణోద్ధరణ కర్త, వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన ఆంధ్రా వాల్మీకి వావిలికొలను సుబ్బారావు జయంతి సందర్భంగా ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఒంటిమిట్ట రామాలయం సమీపంలో ఉన్న సృంగేషియులపై వెలసిన వావిలికొలను సుబ్బారావు సత్రంలో అర్చకులు వీణ రాఘవాచార్యులు, నరసింహచార్యులు, శ్రావణ్ కుమార్‌లు పంచామృతాభిషేకం, అర్చన, మహా నివేదన, మంగళహారతి, అఖండ రామనామ భజన, వాసుదాసు సంకీర్తనలు, వాసుదాసు జీవిత చరిత్ర ప్రవచనం తదుపరి భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. అనంతరం వాసుదాసు రచించిన కోదండరామస్వామి మహత్యం, ఉపదేశ త్రయం, హనుమంతుని చరితం, ఆర్య కథానిధి, భగవత్ ఆరాధనము, ఉపదేశత్రయము పుస్తకాలను వేడుకలకు విచ్చేసిన భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ నవీన్ కుమార్, టీటీడీ సిబ్బంది, వావిలికొలను సుబ్బారావు వంశస్తులు, భక్తులు పాల్గొన్నారు.


సమష్టి కృషితో వైఎస్ఆర్‌సీపీని బలోపేతం చేసుకుందాం



నాయకులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని నారాణరెడ్డిపల్లె పంచాయతీ సుద్దలవాండ్లపల్లెలో ఆదివారం వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మమేకమయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు ఏ సమస్య వచ్చినా తోడుగా ఉంటానని శ్రీకాంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందామని ఆయన తెలియజేశారు. అనంతరం గ్రామంలోని వైఎస్ఆర్‌సీపీ నాయకుడు దివాకర్ కుమారుడు పవన్ ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నందున వారి నివాసానికి వెళ్లి శ్రీకాంత్ పవన్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ సేట్ వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ నాగరాజుయాదవ్, శివశంకర్‌యాదవ్, రాజా, రమేష్, మల్లికార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న బీసీ నేత నాగార్జునాచారి

రాయచోటి అర్బన్ : ఈనెల 16న రాయచోటిలో జరిగే జిల్లాస్థాయి బీసీ సంక్షేమ సంఘం సభను జయప్రదం చేయాలని బీసీ సంఘం నేత నాగార్జునాచారి కోరారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ స్టడీ సెంటర్‌లో బీసీ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సాయిశుభ కల్యాణ మండపంలో సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. బీసీ కులాల్లో ఐక్యతను తీసుకురావడం ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. 16న జరిగే సమావేశానికి బీసీ కులాల నేతలు, సభ్యులంతా పాల్గొని విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పద్మజ, వడ్డెర విద్యావంతుల వేదిక నేత చల్లా రెడ్డెయ్య, రజక సమైక్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు హసనాపురం రవి, కురుబ సంఘం నేత శివ, వాల్మీకి సంఘం నేత రమణయ్య, దేవాంగుల సంఘం నేత మఠం స్వామి, యాదవ ఎంప్లాయీస్ యూనియన్ నేత నాగేంద్రబాబుతోపాటు పలుఎ బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

చేయని పనులు చూపిస్తూ.. నిధులు నొక్కేస్తూ!

- రెండేళ్లుగా నిరుపయోగంలో పంచాయతీ బోరు
- మరమ్మతులు చేశామంటూ అక్రమ బిల్లులు
- ఫిర్యాదు చేసినా విచారణకు ఉన్నతాధికారుల వెనకడుగు



చిలుముపట్టిన బోరు పైపులు



నిరుపయోగంగా ఉన్న స్టార్టర్ లేని ఫ్యూజ్ బాక్స్

పుల్లంపేట : కంచే చేనుమేస్తే ఎవరి చెప్పుకోవాలి. అలాగే తయారైంది మండలంలోని పలువురి అధికారుల తీరు. గ్రామస్థాయిల్లో జరుగుతున్న పనులకు సంబంధించి కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు ఎవరి వాటా వారికి అందుతుండటంతో అందినకాడికి నొక్కేస్తూ విధి నిర్వహణకు తూట్లు పొడుస్తున్నారు. తమ పనులకు వత్తాసు పలుకుతుండటంతో కూటమి నాయకులు ఆయా అధికారులకు కొమ్ము కాస్తూ వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని అనంతంపల్లి పంచాయతీలోని జానకీపురం గ్రామంలో తాగునీటి మోటారు రెండు సంవత్సరాలుగా పని చేయడం లేదు. గ్రామస్తులు అధికారులకు ఈ విషయాన్ని తెలియజేసిన పట్టించుకోలేదు. కథ అంతే అనుకుంటే పొరపాటే. పాడైన బోరుకు గ్రామస్తులకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శులు ఒకసారి కాదు రెండు సార్లు రిపేర్లు కూడా చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. బోరు గురించి ఎప్పుడు చెప్పినా చూస్తాం.. పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. అనుమతిరాగానే మరమ్మతు పనులు చేయిస్తామని కాలం వెల్లదీశారే తప్ప పనులు చేయించలేదు. కానీ రెండు సార్లు పనులు చేయించినట్టు అక్రమంగా బిల్లులు పెట్టి సొమ్ము చేసుకున్నారు. నిధులు స్వాహాలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు క్రియాశీలకంగా వ్యవహరించినట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ విషయం బయటికి పొక్కడంతో ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ తమకేం ప్రమేయం లేదంటూ దాటవేస్తున్నారు. ఇదే విషయాన్ని గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. కూటమి పార్టీలకు ముఖ్య నాయకుల అండదండలతోనే పంచాయతీ కార్యదర్శులపై విచారణకు ఉన్నతాధికారులు వెనకాడుతున్నారన్న ఆరోపణ పెద్ద ఎత్తున వినిపిస్తోంది. ఇదే కాకుండా పంచాయతీలో జరిగిన నిధులు కేటాయింపు, ఖర్చుపై పూర్తిస్థాయి విచారణ జరిపి నిధులు దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



భక్తులకు దర్శనమిస్తున్న నాగారపమ్మ



లక్కిరెడ్డిపల్లె: అమ్మవారి సన్నిధిలో పీఠాధిపతి బండెన్న

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు బీజాక్షరాలతో వున్న మహిమ గల రాయికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న పీఠాధిపతి

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మను ఆదివారం బీరంగి కొత్తకోట బండెన్న పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు యాదవ్, చెల్లు దినేష్ యాదవ్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో స్వామివారికి దుశ్శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పూజలందుకున్న నాగారపమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మకు ఆదివారం ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నాగారపమ్మ ప్రసిద్ధి. ఆదివారాన్ని పురస్కరించుకుని అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.



సంబేపల్లె : బీజాక్షరాల రాయిని దర్శించుకుంటున్న భక్తులు

లూర్దుమాత దీవెనలు పొందాలి



దైవ సందేశం అందజేస్తున్న గురువులు

కడప కల్చరల్ : ప్రతి ఒక్కరూ లూర్దుమాత దీవెనలు పొందుతూ సుఖ సంతోషాలు, భక్తితో జీవితాన్ని గడపాలని నెల్లూరు పీఠాధిపతులు రైట్ రెవరెండ్ డాక్టర్ ఎండీ ప్రకాశం తెలిపారు. నగరంలోని మరియాపురంలోని పాత చర్చి వద్ద ఈ నెల 10,11 తేదీల్లో జరుగనున్న లూర్దుమాత నవదిన ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశ్వాసులు మత పెద్దలతో కలిసి ఊరేగింపుగా కార్యక్రమ వేదిక వద్దకు వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పతాకాన్ని ఆవిష్కరించి తిరునాల మహోత్సవాలను ప్రారంభించారు. పీఠాధిపతులు రైట్ రెవరెండ్ డాక్టర్ ఎండీ ప్రకాశం దివ్య బలి పూజ నిర్వహించి ప్రసంగించారు. కథోలిక సాంప్రదాయంలో మరియమాతకు విశిష్ట స్థానం ఉందని, ఆమెను అనేక పేర్లతో కీర్తిస్తారని తెలిపారు. ఆ తల్లి పేరిట ఎన్నో పండుగలు, ఉత్సవాలు జరుపుకొంటారని, అందులో భాగంగా మరియాపురంలో వెలసిన ఈ తల్లిని లూర్దుమాత అని కొలుస్తారని చెప్పారు.